"అక్కా! అక్కా!"

అద్దం ముందు నిలబడి, కొత్తగా వేసుకున్న ఓణీ, పరికిణీలలో ఒదుగుతూన్న తన కొత్త అందాల్ని విచిత్రంగా పరిశీలించుకుంటూన్న సుమిత్ర ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసింది. పదేళ్ళ తమ్ముడు రవి పరుగెత్తుకుని దగ్గరకు వచ్చేశాడు.

"చిలకని పట్టానే, అక్కా! చిన్న చిలక! ఎంత ముద్దొస్తూ ఉందనుకున్నావు? బలేగా ఉందిలే!" ఆయాసంగా రొప్పుతూ అన్నాడు.

"నిజంగా?" సుమిత్ర కళ్ళని పెద్దవి చేసి చూసింది.

"నిజం, అక్కా! రా చూద్దువుగాని!" చెయ్యి పట్టుకుని లాక్కుపోయాడు రవి. తమ్ముడి వెంట దాదాపు పరుగు పెట్టినంత పని చేసింది సుమిత్ర.

"అదిగో చూడు!" అన్నాడు రవి వేలితో చూపెట్టి. సుమిత్ర చూసింది. అక్కడ ఒక బుట్ట తప్పించి మరేమీ కనబడలేదు సుమిత్రకు.

"ఏదీ చిలక?" ఆత్రత పట్టలేక అడిగింది.

"ఆ బుట్ట కింద ఉంది" అన్నాడు రవి గర్వంగా.

"ఏదీ తియ్యి చూద్దాం!" అంది సుమిత్ర కుతూహలాన్ని ఆపుకోలేక.

"అమ్మో! తీస్తే ఇంకేముంది? ఎగిరిపోదూ!"

"మరి అసలు తియ్యవా? తియ్యకపోతే అక్కడే అది చచ్చిపోతుంది" అంది సుమిత్ర నిరుత్సాహంగా.

"ఎందుకు తియ్యను? తీస్తాను. కాని, దాన్ని పెట్టడానికి ముందర పంజరం ఒకటి కావాలిగా? మన వీధి చివర ఉన్న మేదరి అమ్ముతున్నాడు. పావలా కొకటి. అది తీసుకొచ్చి బుట్ట పక్కనే పెట్టి, ఒక తువ్వాలు బుట్టమీద కప్పి, బుట్టను మెల్లిగా ఎత్తి, చిలకని తువ్వాలుతో పట్టుకుని పంజరంలో వదిలి, గభాలున తలుపు మూసెయ్యాలి. అదేం అంత సులువైన పని అనుకున్నావా?"

"మరి పంజరం తీసుకురా తొందరగా — నాకు చిలకని చూడాలని ఉంది." తొందర పెట్టింది సుమిత్ర.

"తేవడానికి నా దగ్గర డబ్బుల్లేవక్కా! అక్కా, అక్కా! అమ్మ నడిగితే నంపిస్తుంది. నాకో పావలా ఇయ్యవా? మళ్ళీ ఇచ్చేస్తాను నీకు" అన్నాడు రవి బతిమాలుతూ.

"సరేలే! నా పెట్టెలో ఉంది తీసుకో" అంది సుమిత్ర.

"అయితే, ఇప్పుడే వెళ్తొస్తాను. అక్కా! ఆ బుట్టనెవ్వరూ కదపకుండా చూస్తూ ఉండేం!" అని తుర్రుమని బయటకు పరుగెత్తాడు రవి.

రవి అన్నట్టు చిలుక నిజంగానే ముద్దొస్తూ ఉంది. చిన్న కాళ్ళతో, చిన్న చిన్న కళ్ళతో, తెలుపు నలుపు రంగులతో చూడ ముచ్చటగా ఉంది. అది భయంతో పంజరం లోపల అటూ ఇటూ తిరుగుతూంటే సుమిత్రకు తమాషాగా ఉంది. సుమారు ఒక గంట దాన్ని చూస్తూనే గడిపేశారు ఇద్దరూ. అప్పుడు సుమిత్రకు జ్ఞాపకం వచ్చింది.

"పాపం, చిలకకి ఆకలెయ్యదురా, రవీ? ఏమైనా పెట్టద్దూ?" అంది సుమిత్ర.

"అవునే, అక్కా! ఆ సంగతే మరిచిపోయాను. ఉండు, పట్టుకొస్తాను" అని లోపలికి పరుగెట్టి రవి కొంత బియ్యం, నువ్వూ, మరమరాలూ పట్టుకొచ్చాడు. అవి పంజరం నిండా జల్లాడు. కాని, చిలక వాటిని ముట్టుకోలేదు.

"పాపం, దాహం వేస్తుందేమోరా!" అంది సుమిత్ర.

రవి మళ్ళీ లోపలికి పోయి చిన్న గిన్నెతో నీళ్ళు పట్టుకొచ్చాడు. పంజరం తలుపు మెల్లిగా తోసి ఆ గిన్నెను లోపలికి పెట్టాడు. చిలక భయంతో ఓ సారి ఎగిరి మళ్ళీ కిందకు వాలింది. గిన్నె అంచుమీద కూర్చుని నీళ్ళు తాగడం మొదలుపెట్టింది.

"బలే! బలే!" చప్పట్లు కొట్టింది సుమిత్ర. "ఎంత బాగా తాగుతూంది నీళ్ళు?" అంది.

"ఇంకా భోజనానికి రారేమిట్రా మీరు?" లోపలినుంచి శారదమ్మ గొంతు వినబడింది.

గబగబా పంజరాన్ని ఓ మూలకి పెట్టేసి లోపలికి పరుగుతీశారు రవీ, సుమిత్రాను. సాయంత్రం నాలుగయింది.

సుమిత్ర స్నేహితులు రాజా, మురళీ, సుమంతా, సరళా కిలకిలాడుతూ లోపలికి వచ్చేశారు. రాజు సుమిత్ర వేపు వింతగా చూశాడు.

"ఎంత బాగున్నావు? ఇదెప్పటినించి?" అడిగాడు.

"మొన్నటి నించేలే! బాగున్నాయా ఈ బట్టలు నాకు?" అంది సుమిత్ర జారిపోతూన్న ఓణీని పైకి లాక్కుంటూ.

"ఓ ఫస్టుగా ఉన్నావు! నువ్వెప్పుడూ ఇలాగే ఉంటేనే బాగుంటుంది. అది సరేలే గాని, మే మంతా చెరువుగట్టుకి వెళుతున్నాము. వస్తావా నువ్వుకూడా?" రాజా అడిగాడు.

"ఓ! వస్తాను. ఇప్పుడే అమ్మతో చెప్పి వస్తానుండు!" అని లోపలికి పరుగెట్టింది సుమిత్ర.

తల్లితో చెప్పి, బయటికి పరిగెడదామని చూస్తూన్న సుమిత్రని, శారదమ్మ జబ్బ పట్టుకుని వెనక్కి లాగింది.

"చూడమ్మా! నువ్వింక బయట తిరక్కూడదు—అందులోనూ మగపిల్లలతో. రాజుకీ, వాళ్ళకీ నేను చెబుతాలే! నువ్వు లోపలికి పో!" అంది. సుమిత్రకి ఉక్రోషం వచ్చింది.

"ఏం తిరిగితే? ఏమయి పోతానేమిటి? మొన్నటి వరకూ లేంది, ఈ వేళ వచ్చిందా ఏం?" అంది కళ్ళనీళ్ళతో.

"అవునమ్మా! నాన్నగారికి తెలిస్తే కోప్పడతారు. చూడు! రాజుకి నేను చెపుతాలే గాని, నువ్వు ఇంక బయటకు వెళ్ళకు." సుమిత్రని వదిలేసి శారదమ్మ బయటకు నడిచింది. సుమిత్రకు ఏడుపు ఆగలేదు.

"ఎందుకక్కా ఏడుస్తున్నావు?" చేతిలో పంజరం పట్టుకుని వచ్చి రవి అడిగాడు.

సుమిత్ర పంజరం వేపు చూసింది. చిన్న చిలిక అందులో గాభరాగా అటూ ఇటూ తిరుగుతూనే ఉంది. దాన్ని చూసే సరికి కడుపు తరుక్కుపోయింది సుమిత్రకు. దానిలాగే ఉంది తన బతుకూను. అది ఆ పంజరం విడిచి బయటకు

## వేడి

### ఎన్. ఆర్. వెంకటేశం

జీవనాన్ని మరిపించే
జీవాలు పీల్చే
చల్లని . . .
వేడి!
ఎక్కడిది?
వేడి కన్నీళ్ళలోంచి
వీచే గాలిలోది.
పగిలిన గుండెల
పగుళ్ళలోంచి
ఎగిరి పడుతున్న
సెగలది.
నిప్పులాయను
నిప్పుకణికలమీద
చెమ్మ చేస్తున్న
నెత్తురు పొంగులోది.

*

# పంజరం

## వి. వి. రమణారావు

పోలేదు. తనింక ఈ ఇల్లు వదిలి బయటకు కదలలేదు.

• • •

'అవును! పంజరం బ్రతుకే అయింది తన బ్రతుకు!' కిటికీ చువ్వలకి మొహాన్నానించి కూర్చున్న సుమిత్రకి తెలియకుండానే కళ్ళ వెంట నీళ్ళు కారసాగాయి.

'ముప్ఫయ్యేళ్ళు! ఒకటి రెండు కాదు, ముప్ఫయి సంవత్సరాలు తనిక్కడ గడిపేసింది. ఈ నాలుగు గోడల మధ్య, సుఖం అంటే ఏమిటో, శాంతి అంటే ఏమిటో తెలియకుండా గడిపేసింది. ఆ పంజరంలో పిచికకి తన మూలంగా ఆ నాడే విముక్తి లభించింది. కాని, తనకి జీవితమనే పంజరంనించి మాత్రం విముక్తి కలగలేదు. ఆ రోజు తమ్ముడికీ, తనకీ జరిగిన సంభాషణ తనకీ నాడూ గుర్తుకి వస్తుంది. తల్లి తనని బయటకు వెళ్ళనివ్వని ఆ రోజు తనకి ఆ పంజరంలో పిచికమీద విపరీతమైన జాలి కలిగింది.

"పాపం, ఆ పిచిక నొదిలెయ్యరా, రవీ! చూడు, దాని కెంత బెంగగా ఉన్నట్టుందో! పాపం, భయంతో కళ్ళు ఎలా తిప్పుతూందో చూడు" అంది తను ఏడుస్తూను.

"పాపం, వదిలెయ్యాలేం? నే నొదల్ను. నే నెంత కష్టపడి పట్టుకున్నానో నీ కేం తెలుసు?" తమ్ముడు మొండిగా జవాబిచ్చాడు. తను బదులు చెప్పలేదు. ఏడుస్తూనే కూర్చుంది. రెండు నిమిషాలు గడిచాక, తమ్ముడు తన ముఖంలోకి చూసి, "సరేలే, అక్కా, వదిలేస్తాలే. ఏడువకు" అన్నాడు.

ఆ నాడు తనకి చెప్పలేనంత సంతోషం కలిగింది. 'తమ్ముడికి తనంటే ఎంత ప్రేమ! తన కోసం ఏమైనా చేస్తాడు' అనుకుంది ఆ రోజునే. తమ్ముడు గుర్తు రాగానే, ఎప్పుడో తమ్ముడు వ్రాసిన ఉత్తరం జ్ఞాపకానికి వచ్చింది సుమిత్రకు. గూట్లో భరిణ పైకి ఎత్తి దాని కింద చేత్తో తడిమింది. తమ్ముడు వ్రాసిన ఉత్తరం తగిలింది చేతికి. అది తీసుకుని మళ్ళీ చదివింది సుమిత్ర.

"అక్కా!

నా స్నేహితు డొకాయన కేశవరావని, నా కన్నా నాలుగు సంవత్సరాలు పెద్ద. ఆయనకి నీ సంగతి చెప్పాను. సుముఖంగానే ఉన్నట్టున్నాడు. ఇంకో పది రోజుల్లో ఏ సంగతీ చెపుతాడు. మన కింక మంచి రోజులు వస్తాయనే నమ్మకం నా కెందుకో కలుగుతూంది. నా జీవితంలో ఉన్న ధ్యేయమొక్కటే, అక్కా! నీ బ్రతుకులో సంతోషం వెల్లివిరియాలి. నీ ముఖం వెలుగు నింపుకోవాలి. ఆ వెలుగు నీ ముఖంలో కనిపించిన నాడే నా బ్రతుకు తోనూ వెలుగొస్తుంది. ఆ వెలుగు కోసం ఎప్పుడూ వెతుకుతూనే ఉంటాను.

—రవి."

ఆ ఉత్తరం తమ్ముడు వ్రాసి ఆరు నెలలయింది. మళ్ళీ ఉత్తరం లేదు. ఇంకెక్కడి ఆశ? తన బ్రతుకులో వెలుగు వచ్చే సూచనలు లేవు. సుమిత్ర ఒక్కసారి ఆకాశం వేపు చూసింది. తన మనసులో లాగే నల్లటి దట్టమైన మబ్బులు కమ్ముకుని ఉన్నాయి. తన భవిష్యత్తు లాగే కనుచూపు మేరంతా అంధకార బంధురంగా ఉంది. ఈదురుగాలి వీస్తూంది. సన్నటి జల్లు పడుతూంది. గాలి లోపలికి వీచినప్పుడల్లా వర్షపునీటి తుంపరలు వచ్చి సుమిత్ర ముఖాన్ని తడుపుతున్నాయి. ఆ నీటికి తడిసి జుట్టు చెంపలమీద అతుక్కుపోతూంది. కొంచెం చలిగాకూడా ఉన్నట్టుంది. అయినా, సుమిత్రకు అక్కడినించి కదలాలనిపించడం లేదు. చల్లటి గాలికి పాత జ్ఞాపకాలు మనసులో దొర్లుతున్నాయి.

"అక్కా! మనం ఒక చిలకని పెంచుకుందామా?" అడిగాడు తమ్ముడొకసారి.

"వద్దురా! పాపం, అప్పుడు పిచికని పంజరంలో పెట్టాం కదా? అవి బెంగ బెంగగా తిరుగుతూ ఉంటాయి" అంది తను.

"ఛా! చిలకలు అలా తిరగ వక్కా! అవి అసలు మనం వదిలేసినా పంజరం వదిలి బయటికి పోవు. నేను చూశానుగా? ఇంచక్కా మాట్లాడతాయికూడా!" అన్నాడు తమ్ముడు.

"పెంచుకుంటే బాగుంటుంది గాని, చిలక మన కెక్కడ దొరుకుతుందిరా?" సందేహంగా అడిగింది తను.

"ఓస్! అదెంత పని! రోడ్డుమీద జ్యోతిష్యం చెపుతూ ఉంటాడు చూశావు కదక్కా? వాడు నిన్న చెప్పాడు. ఒక పది రూపాయ లిస్తే, పంజరంతో సహా చిలకని ఇస్తానన్నాడు. నువ్వు గనక ఒక ఐదు రూపాయలు సర్దావంటే, నిమిషాల మీద పట్టుకొచ్చేస్తాను చిలకని. ఇస్తావా?" ఆత్రతగా అడిగాడు తమ్ముడు.

"అమ్మో! పది రూపాయలే! అమ్మకి తెలిస్తే తన్నుతుంది!" అంది తను భయంగా.

"నీ కేం ఫరవాలే దక్కా! నేను చూసుకుంటాగా? ముందు నువ్వు ఐదు రూపాయ లియ్యి."

చిలకని పెంచాలని తనకీ కుతూహలం ఎక్కువగా ఉండి తమ్ముడికి డబ్బిచ్చేసింది వెంటనే తాను. తమ్ముడు చిలకనీ, పంజరాన్నీ పట్టుకొచ్చేశాడు. ఆకుపచ్చటి చిలక ఒంటినీ, ఎర్రటి ముక్కునీ చూసి అప్పట్లో తాను మురిసిపోయింది.



అందం చందం
ఫొటో—బి. పి. రెడ్డి (హైదరాబాదు)

• • •

"నా కీ వెధవ పరికిణీలూ, ఓణీలూ వద్దు! నాకు చీర కావాలి. నేను చీర కట్టుకుంటాను." ఒక రోజు పేచీ పెట్టింది సుమిత్ర.

"ఏమిటే, పదహారేళ్ళు వెళ్ళి కొచ్చాయో లేదోగాని, అప్పుడే నీకు చీరలు కావలసి వచ్చాయా? సమయం, సందర్భం చూసుకోకుండా నువ్వు ఏది అడిగితే అది అడిగెయ్యటమేనా? నోరు మూసుకుని పడుండు!" శారదమ్మ కూతుర్ని గదమాయించింది.

దుఃఖం ఉప్పెనలా వస్తూన్న సుమిత్రని తండ్రి దగ్గరికి తీసుకుని అనునయించాడు.

"మాడమ్మా! నీకు కావలసింది చీరే కదా? నీకు ఏ రంగు కావాలో చెప్పు! నేను రేపెలాగా ఊరికి వెళుతున్నాను. నీకు తెచ్చి పెడతాగా!"

'ఏం రంగు బాగుంటుంది చెప్మా' అని తను ఆలోచనలో పడింది. ఇంతలో తన దృష్టి పంజరంలో చిలక మీద పడింది.

"ఆఁ! ఆకుపచ్చ! అదే! ఆకుపచ్చరంగు చీర కావాలి" అంది తను.

"ఛ! ఆకుపచ్చ రంగు చీర ఏమిటే నీ ముఖం! ఇంకేదైనా కొనుక్కో!" అంది అమ్మ.

"కాదు! నా కదే కావాలి!" అంది తను.

"సరే! దానికి ఇష్టమైందే తీసుకొస్తాలే!" అని నాన్నగారు వెళ్ళిపోయారు.

వెళ్ళిపోయిన నాన్నగారు మరి తిరిగి రాలేదు.

సుమిత్ర లేచి కొంగుతో ముఖం తుడుచుకుంది. గది మధ్యకి వచ్చింది. ఆమె చూపు మూలనున్న ఖాళీ పంజరం మీద పడింది. అది చూడగానే ఆమె కళ్ళలో మళ్ళీ నీళ్ళు తిరిగాయి. 'ఆ పంజరాన్ని తెచ్చిన తమ్ముడు ఇప్పుడు వేలమైళ్ళ దూరంలో ఉన్నాడు. వేలమైళ్ళ దూరంలో ఉన్నాడనే కన్నా, వేలమైళ్ళ దూరానికి పారిపోయా డన్నది తనవీ, తన బ్రతుకులోని నైరాశ్యాన్ని తట్టుకోలేక, పంజరంలోని చిలక లాగానే కొన్నాళ్ళు విలవిల లాడిపోయాడు. చివరికి, తనని చూడకపోతేనైనా బాధ తగ్గుతుందనే భావంతో మిలిటరీలో చేరిపోయాడు. ఒక్కగానొక్క తమ్ముడు! ఆ ఖాళీపంజరం చూసినప్పుడల్లా తమ్ముడు జ్ఞాపకం వచ్చి తన మనస్సు కలుక్కుమంటూనే ఉంటుంది. చిన్నతనంలో ఎంత తియ్యగా గడిచాయి రోజులు! ఆ రోజులు మళ్ళీ

వస్తే ఎంత బాగుండును! ఆ రోజుల్లో తన కందరూ ఉన్నారు. ఇప్పుడో? అన్ని విధాలా తను ఏకాకి. తనతో జీవితం పంచుకునేందుకు తల్లిదండ్రులు గాని, తోడబుట్టిన వాళ్ళుగాని ఎవ్వరూ లేరు. రాబోయే జీవితం గురించి అప్పట్లో ఏవో తియ్యటి కోరికలూ, అనుభూతులూ కలిగేవి. ఇప్పుడా ఊహలుకూడా మనసులో మృగ్యం. తా నిప్పుడు గడుపుతూన్నది ఎందుకూ పనికిరాని జీవితం. తనెంత దురదృష్టవంతురాలు!'

సుమిత్ర చీర చెంగులో ముఖం దాచుకుంది. ఎందుకో తెలియకుండా దుఃఖం తెరలు తెరలుగా వచ్చింది. కన్నీళ్ళు కారిపోయాక మనసు కొంచెం తేలిక పడినట్టయింది. అవును! ఈ కన్నీళ్ళు ఉన్నన్ని రోజులు తనకి మనోవ్యథ తప్పదు. అవికూడా ఇంకిపోయే రోజు ఇంక ఎంతో దూరం లేదు అనుకుంది సుమిత్ర.

• • •

గడియారం శబ్దం విని ఉలిక్కిపడి లేచింది సుమిత్ర. టైము ఎనిమిదిన్నర అయింది. రాత్రి తెలియకుండానే ఎప్పుడో నిద్ర పట్టేసింది. కళ్ళు ఇంకా ఎర్రగానే ఉన్నాయి. కిటికీలోంచి బయటికి చూసింది. వర్షం ఇంకా పడుతూనే ఉంది. ఆఫీసుకు టైమయింది. వెళ్ళాలి. గబగబా అన్ని పనులూ ఒక అర్ధ గంటలో ముగించి చెప్పులేసుకుని, గొడుగు పట్టుకుని వీధిలోకి వచ్చింది సుమిత్ర. వచ్చి యథాలాపంగా ఎదురుగా ఉన్న ఔట్ హౌస్ వేపు చూసింది. కిటికీలోంచి రెండు కళ్ళు తననే చూస్తున్నాయి. ఆ చూపు సుమిత్రకు రోజూ అలవాటే. చటుక్కున చూపు మరల్చి రోడ్డుమీదికి నడిచింది సుమిత్ర.

ఔట్‌హౌస్‌లో అద్దెకున్నతని పేరు ఆనందరావు. ఏదో బాంకులో పని. జీతం వెయ్యి రూపాయల దాకా వస్తుంది. భార్య ఉంది. కాని, ఆవిడ ఎక్కువ కాలం పుట్టింటిలోనే ఉంటుంది. అతనికి ముప్ఫయి అయిదేళ్ళుంటాయి. కొంచెం స్ఫురద్రూపి. అక్కడ చేరిన మొదట్లో అతను సుమిత్ర కనబడితే తల వంచుకుని వెళ్ళిపోయేవాడు. కాని, రాను రాను అతని ధోరణి మారింది. సుమిత్ర కనిపిస్తే ఏదో కల్పించుకుని మాట్లాడ్డానికి ప్రయత్నించేవాడు. సుమిత్ర మాటలు పెంచకుండా ముక్తసరిగా తుంచేసేది. రోజూ సుమిత్ర ఆఫీసుకు వెళ్ళే సమయానికి అత నక్కడ విధిగా హాజరయ్యేవాడు. అతనికి తన మీద కోరికఉన్నట్టు సుమిత్ర గ్రహించగలిగింది. అందుకే అతన్ని తప్పుకు తిరగసాగింది.

"హలో! గుడ్ మార్నింగ్! ఏమిటి, అప్పుడే ఆఫీసుకు వెళ్ళిపోతున్నారా?"

ఉలిక్కిపడి చూసింది సుమిత్ర. ఎదురుగా రాఘవులు.

రాఘవులు పక్క ఇంట్లో ఉన్న [illegible] మొగుడు.


వెకిలిగా నవ్వుతూ ఎదురుగా నిలబడ్డాడు. అతన్ని [illegible] ఒళ్ళు [illegible] సుమిత్రకు. [illegible] కాని, చింత చచ్చినా పులుపు [illegible] ఆడవాళ్ళంటే విపరీతమైన వెర్రి [illegible] తిరుగుతాడు.

"తొమ్మిదిన్నర దాటింది కదండీ మరి!" అంది సుమిత్ర [illegible] జరుగుతూ—

"అంటే, పది గంటలకి కదా ఆఫీసు? ఏవో పుస్తకాలు పట్టుకెళుతున్నట్టున్నారే?"

చేతికి చెయ్యి తగిలిస్తూ చేతిలో ఉన్న పుస్తకాల్ని లాక్కున్నాడు. చెయ్యి వెనక్కి తీసేసుకుంది సుమిత్ర. రాఘవులు ఎదోలా నవ్వుతూ, "కొంచెం మాకూ పుస్తకాలు తెచ్చిస్తూండండి! కొంచెం మా సంగతికూడా చూడండి!" అని వెకిలిగా ఓ నవ్వు నవ్వేసి, పుస్తకాలు తిరిగి ఇచ్చేసి వెళ్ళిపోయాడు.






'అమ్మయ్య! పీడ వదిలింది!' అనుకుంది సుమిత్ర. ముందు కడుగు వెయ్యబోయి వెనక్కి తిరిగి చూసింది. ఆనందరావు తననే చూస్తున్నాడు. సుమిత్ర మనసులో అదోలా అయింది. తల వంచుకుని ముందుకి సాగిపోయింది.

రాఘవులు వ్యాపారం చేస్తాడు. సాధారణంగా నెలకి పదిహేను రోజులు ఇంట్లో ఉండడు. డబ్బు బాగా గడించాడు. ఉన్నది ఒక్కడే కొడుకు. వాడికి పుట్టినప్పటి నించీ ఏదో జబ్బు. వాడి మందులకీ మాకులకీ కొన్ని వేం రూపాయలు ఖర్చు చేశాడు. అయినా, అదేం జబ్బో తగ్గుముఖం పట్టలేదు. సుభద్రమ్మకి పొద్దస్తమానమూ వాడితోనే సరిపోతుంది. అప్పుడప్పుడు ఆవిడ పిలిస్తే సుమిత్ర వాళ్ళింటికి వెళ్ళేది. అంత డబ్బున్న వాళ్ళిల్లూ ఒక నరకంలా ఉంటుంది. అక్కడ ఎక్కువ సేపు కూర్చోలేక వచ్చేసేది సుమిత్ర.

రాఘవులికి చాలా దుర్వ్యసనాలు ఉన్నాయి. ఆ ఇళ్ళలో ఉండే వాళ్ళందరికీ రాఘవులు గురించి తెలుసు. కాని, అందరూ మొహమాటానికి అతనితో బాగానే మాట్లాడతారు. రాఘవులే కావాలని సుమిత్రతో పరిచయం కల్పించుకున్నాడు. తరవాత బలవంతం మీద సుమిత్రను ఇంటికి తీసుకు వెళ్ళి, భార్యని పరిచయం చేశాడు. తనంటే రాఘవులికి అమితమైన ఇష్టం అని సుమిత్రకు తెలియక పోదు. కాని, ఆ ఊహ కలిగితేనే సుమిత్రకు వికారం కలిగేది. అందుకే, రాఘవులిని కనీసం ఊహల్లోనైనా రానివ్వకుండా జాగ్రత్త పడేది సుమిత్ర.

ఆఫీసులో కూర్చున్న దన్న మాటే గానీ, సుమిత్ర మనసు మనసులో లేదు. మాటిమాటికీ ఆమెకి ఆనందరావు గుర్తు రాసాగాడు. అతని చూపులు ఆమె మనసుని కలిచి వెయ్యసాగాయి. ఎందుకో ఇటీవల సుమిత్ర మనసు ఆమె వశం తప్పుతూంది. సుమారు ఆరేడు సంవత్సరాల క్రితం, కొత్తగా ఆఫీసులో చేరినప్పుడు తనతో చొరవ చెయ్యబోయి, చివాట్లు తిన్న తోటి ఉద్యోగి శంకరం అన్న మాటలు ఈ నాటికీ ఆమె చెవుల్లో గింగురు మనసాగాయి.

'దాహం వేస్తే మంచినీళ్ళు తాగుతాం. ఆకలి వేస్తే అన్నం తింటాం. అలాగే ఈ దేహ సంబంధమైన కోరిక కూడాను. వివాహం సాంఘికమైన కట్టుబాటు మాత్రమే. అంతమాత్రం చేత వివాహం జరగని ప్రతి వ్యక్తి ఈ సుఖాన్ని పొందగూడదనటం అన్యాయం. ఆ మాటకొస్తే, భగవంతుడు ఏ వ్యక్తినైనా సృష్టించేటప్పుడు—ఈ వ్యక్తికి వివాహం అవుతుంది, ఈ సుఖానికి అర్హుడు, ఈ వ్యక్తికి వివాహం అవదు, అందువల్ల ఈ సుఖానికి అనర్హుడు అనే నిబంధనలతో సృష్టించలేదు. ఇవన్నీ మనం కల్పించుకున్న ఆచారాలు. ఈ ఆచారాలు శారీరకంగా మనిషిని కట్టి పడేసినా, మానసికంగా కట్టి పడెయ్యలేవు. మనసును చంపుకోవడం ఆత్మహత్య కన్నా హీనమని నా అభిప్రాయం.'

ఆ మాటలు అన్న శంకరం మరొక నెల రోజుల్లో ట్రాన్స్‌ఫర్ చేయించుకుని తన జీవితంలోంచి నిష్క్రమించాడు.

తన మీద అంత కోరికున్నప్పుడు, తనని పెళ్ళి చేసుకుంటానని అత నెందుకనలేదో అప్పట్లో అర్థం కాలేదు సుమిత్రకు. కాని, తరవాత తెలిసింది. అతని కన్నా పెద్దవాళ్ళు, పెళ్ళి కావలసిన ఆడపిల్లలు ముగ్గురున్నారు వాళ్ళింట్లో. ఈ సాంఘిక ఆచారాల గుప్పెట్లో నలిగి పోతూన్న వ్యక్తుల్లో శంకరంకూడా ఒకడన్న మాట. అప్పట్లో శంకరం మీద జాలి లాంటిది మాత్రం కలిగింది సుమిత్రకు.

సుమిత్ర పని చెయ్యకపోయినా, గడియారం యథావిధిగా పని చేస్తూనే ఉంది. సాయంత్రం అయిదయింది. సుమిత్ర బాగ్, గొడుగూ తీసుకుని ఆఫీసు బయటికి వచ్చింది. ఇల్లు జ్ఞాపకం వచ్చేసరికి సుమిత్ర గుండెలు గుబగుబలాడాయి. మళ్ళీ ఆనందరావు అక్కడే నిలుచుంటాడు. తన వేపు అలాగే చూస్తాడు. తను తల వంచుకుని ఇంట్లోకి వెళ్ళిపోతుంది. రాత్రి అయిపోతుంది. తెల్లవారిపోతుంది. తను మళ్ళీ ఆఫీసుకు వచ్చేస్తుంది. మళ్ళీ ఆఫీసూ, ఇల్లూ, ఆఫీసూ, ఇల్లూ. . . తన దినచర్య తలపుకి వచ్చేసరికి సుమిత్ర మనసులో ఏదో కలుక్కుమంది. ఏదో అసంతృప్తి మనసులో పేరుకుపోసాగింది! లాభం లేదు. ఏదో జరగాలి! ఆ ఏదో ఏమిటో సుమిత్రకు తెలియడం లేదు.

భారంగా అడుగులు వేసింది సుమిత్ర.

ఇంటి కొచ్చేసరికి సుమిత్ర అనుకున్నట్టుగానే ఆనందరావు ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు. సుమిత్రను చూసి చిన్న చిరునవ్వు నవ్వాడు. సుమిత్ర తిరిగి నవ్వలేదు. ఆమె గుండెలు దడదడ కొట్టుకున్నాయి. మొహాన చిరుచెమట కమ్మింది. చీర చెంగుతో ముఖాన్ని అద్దుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

రాత్రి పదకొండయింది. చుట్టు పక్కల ఇళ్ళలో ఎక్కడా శబ్దం లేదు. అందరూ నిద్రాదేవి ఒడిలోకి వాలిపోయి ఉంటారు. ఆనందరావు ఇంట్లో చిన్న లైటు వెలుగుతూంది. సుమిత్రకు తెలుసు...తను లైటార్పితేనే గాని అతను లైటార్పడు. సుమిత్రకు ఈ రోజెందుకో మనసు మరింత కల్లోలంగా ఉంది. శంకరం అన్న మాటలు చెవుల్లో ప్రతిధ్వనించసాగాయి.

'వివాహం సాంఘికమైన కట్టుబాటు మాత్రమే. వివాహం కానంత మాత్రాన ఏ వ్యక్తి సుఖం పొందకూడదనటం అన్యాయం. . .'

సుమిత్ర గుండెలు దడదడ కొట్టుకున్నాయి. 'అవును! తన కన్యాయం జరుగుతూంది. తన జీవితం కొవ్వొత్తిలా హరించుకు పోతూంది. ఇలా మరికొన్నేళ్ళు గడిచిపోతే, తన జీవితం ముగిసిపోతుంది.'

తన జీవితం ముగిసిపోతుం దనుకునే సరికి సుమిత్ర గుండె ఆగిపోయినట్లయింది.

'అమ్మో! ఏదీ అనుభవించకుండా తన జీవితం ముగిసి పోవడమే? వీల్లేదు! తను మాత్రం అందరిలా పుట్టింది కాదూ? తను ఈ అన్యాయాన్ని ప్రతిఘటించాలి.

శంకరం చెప్పింది నిజం! తన జీవితం ఈ సాంఘిక ఆచారమనే పెళ్ళి చాటున నలిగి, నాశనమై పోకూడదు. దృఢ నిశ్చయంతో సుమిత్ర లేచి తలుపు దగ్గరికి వెళ్ళి, తలుపు తీసింది. ఆనందరావు నీడ కిటికీలోంచి స్పష్టంగా కనిపిస్తూంది.

'తనకీ, తన జీవిత సుఖానికీ దూరం ఇరవై అడుగులు. ఆ ఇరవై అడుగులూ తను వెయ్యగలిగితే తన మనోవ్యథ తీరిపోతుంది.'

సుమిత్ర గుండెలు గుబగుబలాడాయి.

'తాను వేసేవి లోకానికి తప్పుటడుగులే కావచ్చు. కాని, తన జీవితంలో తనకి న్యాయం జరగాలంటే అవి తనకి తప్పని అడుగులు.'

ఎవరయినా చూస్తున్నారేమోనని చుట్టూ ఒకసారి చూసి, ఎవరూ చూడ్డం లేదని నిర్ధారించుకున్నాక సుమిత్ర నాలుగడుగులు ముందుకు వేసింది. ఆనందరావు నీడ కిటికీ దగ్గిరనుంచి కదిలింది. సుమిత్ర కాలు తీసి అయిదో అడుగు వెయ్యబోయేలోగా గొల్లుమని ఏడుపు వినిపించింది. గుండెలు దడదడ కొట్టు

కున్నాయి సుమిత్రకు. ఆ ఏడుపు సుభద్రమ్మ ఇంటినించి వచ్చింది. గుండెలు అవిసిపోయేలా ఉన్న ఆ ఏడుపు విని, ఒక్క అంగలో సుమిత్ర సుభద్రమ్మ ఇంటి గుమ్మం దగ్గరికి చేరుకుంది. అక్కడ కనిపించిన దృశ్యం చూసి కొయ్యబారిపోయింది. సుభద్రమ్మ నాలుగేళ్ళ కొడుకుని ఒళ్ళో పెట్టుకుని ఏడుస్తోంది.

* * *

సుభద్రమ్మ కొడుకు పోయాక సుమిత్రకు ఏదో విరక్తిలాంటిది కలిగింది. 'ఏమిటీ జీవితాలు? ఆ పసివాడి జీవితం నాలుగేళ్ళు గడవగానే ముగిసిపోయింది. భగవంతుడు వాణ్ణెందుకు పుట్టించినట్టు? ముప్ఫయ్యేళ్ళు గడిపిన తనే తన జీవితం వ్యర్థమనుకుంటూంటే, ఆ పసివాడి జీవితానికి అర్థం ఏమిటి?' సుభద్రమ్మని తలుచుకుంటే విపరీతమైన జాలి కలిగింది సుమిత్రకు.

ఆ తరవాత కొన్ని రోజులు ఆఫీసుకు సెలవు పెట్టేసి, సుమిత్ర దగ్గర్లో ఉన్న ప్రదేశాలన్నీ తిరిగి వచ్చింది. ఎంత తిరిగినా, ఏం చేసినా ఆమె మనసులో ఏదో వెలితిమాత్రం మిగిలిపోయింది. కోరుకున్న మనశ్శాంతి దొరకలేదు. ఆఫీసులో పనిచెయ్యడమే మంచిదిలా కనిపించింది సుమిత్రకు.

రెండు నెలలు గడిచాయి. ఆనందరావు భార్య పుట్టింటి నించి వచ్చింది. సుమిత్రకు ఆమెతో పరిచయం అయింది. ఆమె పిలిస్తే సుమిత్ర వాళ్ళింటికి కూడా వెళ్ళటం సాగించింది. మొదట్లో వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూన్నప్పుడు ఆనందరావు బయటకు వెళ్ళిపోయేవాడు. కాని, తరవాత తరవాత కొంచెం చనువు పెరిగాక వాళ్ళ సంభాషణలలో జోక్యం కల్పించుకోవటం మొదలెట్టాడు. సుమిత్ర మాత్రం అతనికి కొంచెం దూరంగానే ఉంటూ వచ్చింది.

కొన్ని రోజులు గడిచాక, ఒక రోజు ఆనందరావు భార్య రాత్రికి రాత్రి బయలుదేరి హఠాత్తుగా పుట్టింటికి వెళ్ళిపోయింది. ఈ సారి ఆమె వెళ్ళడం గురించి ఆ చుట్టుపక్కల వాళ్ళందరూ రకరకాలుగా చెప్పుకున్నారు. ఆనందరావే ఆమెతో తెగతెంపులు చేసుకుని పంపించేశాడని కొందరూ, ఆమె తనంతట తానే విడాకులు అడిగి వెళ్ళిపోయిందని కొందరూ అనుకున్నారు. సుమిత్ర ఆవేమీ పట్టించుకోలేదు. కాని, ఆనందరావు భార్య ఉన్నంత కాలం సుమిత్ర ప్రశాంతంగా గడిపింది. ఆమె వెళ్ళిపోయిన దగ్గర్నుంచీ మళ్ళీ సుమిత్ర మనసులో ఘర్షణ మొదలయింది. భార్య ఉన్నప్పటి పరిచయాన్ని పురస్కరించుకుని ఆనందరావు సుమిత్రతో మరికొంచెం సన్నిహితంగా మసలసాగాడు.



ఈ జేబులో నుంచి ఆ క్రికెట్ టెస్ట్ టికెట్ ఇలా పడేస్!

రాను రాను సుమిత్రకు ఎందుకో రోజులు వ్యర్థమై పోతున్నాయనే బాధ మళ్ళీ కలగటం మొదలెట్టింది. శంకరం మాటలు మళ్ళీ పదే పదే జ్ఞాపకం రాసాగాయి. 'ఆ దిక్కుమాలిన శంకరం తన మనసుకి శాంతి లేకుండా చేశాడు' అనుకోసాగింది సుమిత్ర. ఆమె హృదయం అల్లకల్లోలమైన సముద్రంలా తయారయింది. సుభద్రమ్మ కొడుకు చావూ, అప్పట్లో తనకి కలిగిన విరక్తీ... మళ్ళీ అన్నీ సుమిత్ర మనసులో జ్ఞాపకాల అట్టడుక్కి చేరుకున్నాయి. ఆనందరావు సాన్నిధ్యం కోరసాగింది సుమిత్ర మనసు. ఆఫీసులో పని మళ్ళీ జరగటం లేదు. ఇంటికి వచ్చేసరికి ఆనందరావు చూపులతో, అతని తలపులతో మెదడు మొద్దుబారిపో సాగింది. సుభద్రమ్మ కొడుకు పోవడానికీ, ముందున్న మనఃస్థితి రావడానికి ఎంతోకాలం పట్టలేదు సుమిత్రకు.

రాఘవులు ఊళ్ళో లేడు. ఏదో పని మీద ఆ సాయంత్రమే పారుగూరు వెళ్ళాడు. సుభద్రమ్మ ఉన్న అలికిడి ఎక్కడా వినపడటం లేదు. 'పాపం, కొడుకు పోయిన దగ్గర్నుంచీ సుభద్రమ్మ ఎక్కడా బయటికి రావటం లేదు. కొడుకుని తలుచుకుని కుమిలిపోతూంది కాబోలు' అనుకుంది సుమిత్ర. పరిసరాలన్నీ మాటు మణిగి ఉన్నాయి. ఆ నిశ్శబ్దంలో సుమిత్ర గుండె చేసే చప్పుడు ఆమెకే స్పష్టంగా వినిపిస్తోంది.

రాత్రి పన్నెండయింది.

సుమిత్ర ఏదో నిశ్చయానికి వచ్చి దిగ్గున లేచి కూర్చుంది. ఆనందరావు ఇంట్లో లైటు వెలగటం లేదు. కాని, ఆనందరావు మేలుకుని ఉంటాడని తెలుసు సుమిత్రకు.

తన కదలిక లన్నింటినీ అతను గమనిస్తూ ఉంటాడనీ, తను ఎంత మెత్తగా నడిచినా తన అడుగుల శబ్దం వింటాడనీ సుమిత్రకు బాగా తెలుసు. లేచి వెళ్ళి తలుపు తెరిచింది. నీటమీద గాలి, చల్లటిగాలి రివ్వున ముఖానికి తగిలింది. పరవశించిపోయింది సుమిత్ర. ఆమెలో కాంక్ష ప్రబలమైంది. రెండడుగులు ముందుకి వేసింది. హఠాత్తుగా ఆనందరావు ఇంటి తలుపు తెరుచుకుంది. సుమిత్ర స్తంభం చాటుకి తప్పుకుంది. ఆనందరావు ఇంటిలోనుంచి ఒక ఆకారం, గబగబా బయటికి వచ్చి సుమిత్రని దాచుకుంటూ నడిచి వెళ్ళిపోయింది. ఆ క్రీనీడలో ఆ వ్యక్తిని చూసి నిర్ఘాంతపోయింది సుమిత్ర.

ఆమె సుభద్రమ్మ!

సుమిత్రకు గొంతుక ఆర్చుకుపోతున్నట్టయింది. కళ్ళు గిరగిర తిరగసాగాయి. హఠాత్తుగా చలిజ్వరం వచ్చినట్టయింది. 'తా నెవరిని చూసింది? తాను చూసింది కలా? నిజమా? తాను చూసింది సుభద్రమ్మనేనా?

కొడుకు పోయి మూడు నెలలు కూడా కాని సుభద్రమ్మ!

దుఃఖంతో కుమిలిపోతున్న దనుకున్న సుభద్రమ్మ!

సుమిత్రకు తల తిరిగిపోయింది. మెల్లిగా గోడ ఆసరాగా చేసుకుని, ఇంట్లో వచ్చి పక్కమీద కూలబడింది. ఆమె కెందుకో వెక్కి వెక్కి ఏడుద్దా మనిపిస్తోంది. ఆమె చెవుల్లో కొడుకు పోయినప్పటి సుభద్రమ్మ ఏడుపు ప్రతిధ్వనిస్తోంది. కొంచెంసేపట్లో ఆ ఏడుపు మరింత పెద్దదయినట్టయి, చెవులు గింగురు లెత్తసాగాయి. రెండు చేతులతో చెవులు మూసుకుంది సుమిత్ర.

'తన కోరిక ఇంత నికృష్టమైందా? భగవంతుడా! మనిషిమీద మనిషికి ఈ వ్యామోహాన్ని ఎందుకు కలిగించావు? మనిషికీ, మనిషికీ మధ్య ఈ ఆకర్షణని సృష్టించి, వాళ్ళని ఇంత నీచానికి దిగే పరిస్థితులని ఎందుకు కలిగించావు?'

సుమిత్ర కెందుకో ఎక్కడికైనా పారిపోవా లనిపించింది. మనసులో అశాంతి భగ్గు మనసాగింది. ఏం చేస్తే తన అశాంతి అణిగిపోతుంది? ఆమె చూపు మూలనున్న పంజరం మీద పడింది. సుమిత్ర లేచి వెళ్ళి దాన్ని చేతుల్లోకి తీసుకుంది. ఆ పంజరాన్ని చూస్తూంటే ఆమెలో అశాంతి మంచులా కరిగిపోసాగింది. తను మళ్ళీ పదిహేనేళ్ళ అమ్మాయిగా మారిపోయినట్టూ, తల్లీ, తండ్రీ, అందరూ తనచుట్టూ ఉన్నట్టూ అనిపించసాగింది. దానివేపే తదేకంగా చూస్తున్న సుమిత్ర కళ్ళనించి జలజలా కన్నీళ్ళు రాలిపడ్డాయి. అలాగే చూస్తూ ఉండిపోయిన సుమిత్రకు కొంచెం సేపట్లో అందులోంచి, 'ఎందు కక్కా ఏడుస్తున్నావు!' అని అడుగుతూన్న తమ్ముడి ముఖం కనిపించింది.

ఆకాశంలో మెరుపు మెరిసింది. ఆ వెలుగు సుమిత్ర ముఖం మీద ప్రతిఫలించింది.

'ఆ వెలుగుకోసమే నక్కా నేను ఎదురు చూస్తున్నది' అని తమ్ముడన్నట్టయింది సుమిత్రకు. ★